అధ్వానంగా పారిశుధ్యం

- ఆర్మూర్ పట్టణంలోని వీధుల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు


హుస్నాబాద్ కాలనీలోని రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. వీధుల్లోని చెత్తకుప్పలను పారిశుధ్య సిబ్బంది తరలించాల్సి ఉండగా, అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడిక్కడే చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు చెత్తను ఆరుబయట వేయకుండా అధికారుల అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. అలాగే చెత్తడబ్బాలు ఏర్పాటుచేసినప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో వృథాగా మారాయి. దీంతో స్థానికులు చెత్తను రోడ్లపై వేయడంతో కోతులు, పందులు, కుక్కలు చెల్లాచెదురుగా చేస్తున్నాయి. దీంతో కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచకుంటే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..

పట్టణంలోని రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను డంపు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెత్త పేరుకపోయిన వెంటనే మున్సిపల్ అధికారులు తరలించాలి. సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలి.
– మోహన్, ఆర్మూర్

ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తాం..


మున్సిపల్ పరిధిలో చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చూస్తాం. ప్రతి కాలనీల్లో చెత్తవాహనాలు వెళ్లేవిధంగా చూస్తాం. ప్రజలు సైతం చెత్తను మున్సిపల్ వాహనాల్లోనే వేయాలి.
–ప్రసాద్‌చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఉచిత ప్రయాణంతో మహిళలకు చేయూత

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి


ఆర్మూర్ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించడం ద్వారా వారికి ఆర్థిక చేయూతనందించినట్లు అవుతోందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఆదివారం ఆర్మూర్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళలతో పాటు బస్సులో ప్రయాణించారు. ఆర్డీవో వినోద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్టీసీ డిపో అధికారులు, బీజేపీ నాయకులు కంచెట్టి గంగాధర్, పొల్కం వేణు, యామాద్రి భాస్కర్, పాలెపు రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సందర్శన..

ఆర్మూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సందర్శించారు. ఇకపై నియోజకవర్గంలో సమస్యలను విన్నవించడానికి వచ్చే వారు క్యాంపు కార్యాలయంలో తనను కలువవచ్చని సూచించారు.

ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభం

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ. 5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచడంతో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ పథకంను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సకు వచ్చే వారికి వ్యాధి నయం అవుతుందనే నమ్మకం రావాలని అన్నారు. అయుష్మాన్ భారత్‌లో భాగంగా ఎంపిక చేసిన ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా చికిత్స చేస్తారన్నారు. అనంతరం సీఎం అమలు చేస్తున్న పథకాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు, వైద్యులు అమృత్‌రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- బాల్కొండ కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌కుమార్


కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మోర్తాడ్/కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని, కార్యకర్తలకు ఎలాంటి కష్టం రాకుండా కంటికి రెప్పలా చూసుకుంటానని పార్టీ బాల్కొండ నేత ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. కమ్మర్‌పల్లిలోని లలితా గార్డెన్స్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీకి మోసం చేసిన వారిని వదిలేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఎంపిక కావడం పార్టీ అదృష్టం అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి ఆగదని అన్ని సంక్షేమ కార్యక్రమలను ప్రజలకు అందించేలా చేస్తామన్నారు. ఏ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పని కావాలో కార్యకర్తలు గుర్తించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, నాయకులు సుంకెటరవి, గడ్డం నర్సారెడ్డి, జక్కరాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకు ముందుకురావాలి


బోధన్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్లు


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

బోధన్: పేద ప్రజలను ఆదుకునేందుకు కుల సంఘాలు ముందుకురావాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు మండవ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని కమ్మ సంఘంలో ఆదివారం కమ్మ సంఘం సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం – కార్తీక వన భోజన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండవ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అందరూ ఐకమత్యంతో అభివృద్ధి చెందేందుకు, అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పల్లెంపాటి శివన్నారాయణ, దావులూరి హరినాథ్ బాబు, కోశాధికారి పల్లెంపాటి శ్రీధర్, ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

- తొమ్మిది నెలలుగా సాగుతున్న రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


మెండోరాలో సాగుతున్న రోడ్డు డివైడర్ పనులు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో చేపడుతున్న నాలుగులైన్ల రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెండోరాలోని రహదారి మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడానికి గత ప్రభుత్వం రూ.2.50కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ పనులకు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు సాగుతునే ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలువురి నివాసాలను కొంతమేర తొలగించాల్సి వచ్చింది. ముందుగా రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలను నిర్మించారు. అనంతరం తారు రోడ్డు వేశారు. ప్రస్తుతం రోడ్డు మధ్యలో డివైడర్ పనులను చేపడుతున్నారు. కానీ పనులను అసంపూర్తిగా చేయడంతో నివాసాలను కొంతమేర తొలగించిన స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాగే రోడ్డు వెడల్పు పనుల్లో నాణ్యత లోపించడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని, రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం..

మెండోరాలో రోడ్డు విస్తరణ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడటం లేదు. గతంలో కూలిన డ్రెయినేజీ పనులను మళ్లీ నిర్మింపజేశాం. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులను వెంటనే పూర్తి చేస్తాం.
– వినీత్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, బాల్కొండ

డ్రైవింగ్ లైసెన్స్ అందజేత



బోధన్: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ స్వగృహంలో ఆదివారం యువకులకు ఉచితంగా కల్పించిన డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను షకీల్ సతీమణి, అయేషా వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షురాలు అయేషా ఫాతిమా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం



భీమ్‌గల్: పట్టణంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం', 'రాజీవ్ ఆరోగ్య శ్రీ'పథకాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ మహేష్, జెడ్పీ సీఈవో గోవింద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, మెడికల్ ఆఫీసర్ అజయ్ పవర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీలోని, రోడ్డు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. కాలనీవాసులు గోసికొండ అశోక్, కమలాకర్, సత్యనారాయణగౌడ్, కొంతం రాజు, సాయన్న, ఎర్ర భూమయ్య, ఎల్టీ కుమార్, రవి, భాజన్న పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

బోధన్‌రూరల్(బోధన్): రాష్ట్రంలో ఇటీవల తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులను, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. అధికారులు తడిసిన ధాన్యాన్ని కొనాలన్నారు. ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, కల్తీ విత్తనాలు లేకుండా చూడాలన్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతుల ఖాతాలో డబ్బులు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగాధరప్ప, భూమన్న, దేవేందర్‌సింగ్, లక్ష్మణ్, నాగలక్ష్మి, విజయ, పద్మ పాల్గొన్నారు.

త్వరలోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం


బోధన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను త్వరలో రాష్ట్రంలో అమలు చేస్తామని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో ఆదివారం ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ఆమె అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన రెండు, మూడు రోజుల్లో అమలు చేయడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, వైద్యాధికారిణి సమత, కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, సత్యం నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బడాపహాడ్‌లో దోపిడీ అరికట్టాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వర్ని: బడాపహాడ్‌లో భక్తుల నుంచి దోపిడీకి పాల్పడుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ వర్ని ఏరియా కార్యదర్శి నన్నే సాబ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడాపహాడ్‌లో జరుగుతున్న దోపిడీపై సీఎం దృష్టిసారించాలని కోరారు. అలాగే దర్గా వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు. బస్టాండ్ నుండి దర్గా వరకు రోడ్డు వేసి, భక్తులకు సౌకర్యం కల్పించాలని కోరారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు సాయిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

■ నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు.

సప్తహారతి గిరి ప్రదక్షిణ..

ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై సోమవారం కార్తీక మాస శివరాత్రి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సప్తహారతి గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంతో గిరి ప్రదర్శన నిర్వహించి, ప్రధాన చౌరస్తా వద్ద సప్త హారతులు నిర్వహిస్తారన్నారు. తిరిగి స్వామివారు రథంతో సిద్ధులగుట్టకు చేరుతారన్నారు. ప్రజలు ఈ రథయాత్రలో పాల్గొన్ని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

■ ప్రతిరోజు ధ్యానం చేయాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ధ్యానం చేయాలని కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ అన్నారు. పట్టణంలోని సిద్ధులగుట్టపై గల నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ధ్యాన ఆత్మ జ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, సంపూర్ణంగా పూర్తి శాకాహారం భుజించాలన్నారు. ధ్యాన మందిరం నిర్మించడం చాలా గొప్ప విషయమని, ప్రతి ఒక్కరూ ఈ ధ్యాన మందిరాన్ని ఉపయోగించుకొని ప్రతిరోజు ధ్యానం చేయాలన్నారు. పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, శివకాంత్, సభ్యులు శ్రీనివాస్, లక్ష్మణ్, కిష్టయ్య, దేవేందర్‌రెడ్డి, కొత్తపల్లి రాజిరెడ్డి, జ్ఞానదాత సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్(తెలుగు)-9.40
యానిమల్ (హిందీ) 1.00, 5.00, 9.00

స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 09.30, 12.45, 4.00, 7.15, 10.30

స్క్రీన్-3 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్(తెలుగు)- 11.50, 3.10, 6.30, 9.50

స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00

ఇందల్వాయికి తరలిన కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తొలిసారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలికేందుకు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదవారం ఇందల్వాయి టోల్ ప్లాజా వద్దకు తరలి వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వారు ఘనంగా స్వాగతం పలికారు. నాయకులు బాకారం రవి, ఎర్రన్న, కుందేళ్ళ శ్రీనివాస్, ఆసిఫ్, రమేష్, ప్రసాద్, జనార్దన్, ఉన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

దండుగుల వెంకటేష్ S/o. దండుగుల వెంకన్న, R/o. H.No: 2-108/3A, దేగం, మం॥ ఆర్మూర్, నిజామాబాద్.
నేను 25-11-23 నాడు దేగాం నుండి ఆర్మూర్‌కి బైక్‌పై వెళ్తుండగా R0127825 నెం, గల పాస్‌పోర్ట్ పోయినది.
దొరికినవారు సంప్ర: 9966532554

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి


నగరంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

ఖలీల్‌వాడి: ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా తెలిపారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో ఆదివారం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు ఈ పథకంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ స్కీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వం లాగా కాకుండా నిరంతరం ప్రజలకు ఉపయోగపడే విధంగా అందించాలన్నారు. ఆర్టీసీ అధికారులు కూడా ప్రజలకు సహకరించాలన్నారు. ప్రజలు సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం మహిళలకు ఉచిత టికెట్ అందచేసి సిటీ బస్సులో ప్రయాణం చేశారు. అలాగే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి 60 శాతం నిధులు అందజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇచ్చి, రాజీవ్ ఆరోగ్య శ్రీ పేరు పెట్టడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికంగా నిధులు ఇస్తే ప్రధాని ఫొటో పెట్టకపోవడం బాధాకరమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ డీఎం సాయన్న, ఆర్టీసీ అధికారులు, డీఎంహెచ్‌వో సుదర్శన్, డిప్యూటీ సూపరిండెంట్ బాలరాజ్, వైద్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వనభోజన కార్యక్రమం

నిజామాబాద్ సిటీ: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం ఘనంగా జరిగింది. బోర్గాం(పీ) శ్రీ లక్ష్మీమహా గణపతి ఆలయంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు లలితా పారాయణం, తులసీమాత, పూజ, గోపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కార్యక్రమానికి విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ దేశ్‌ముఖ్, రొట్టె సురేష్, కోశాధికారి రమేష్ కులకర్ణి, లక్ష్మీ నారాయణ భరద్వాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి)లోగల బంటు మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంటు గంగాదాస్, ఉపాధ్యక్షుడిగా బంటు సాయికుమార్, ప్రధానకార్యదర్శిగా బంటు రమేష్, కోశాధికారిగా చిట్టి మోహన్, బంటు శ్రీకాంత్, సభ్యులుగా మాచపత్రి చంద్రశేఖర్, చిట్టి పండరి, సలహాదారులుగా పుప్పాల శోభ, చిట్టి సాయిరెడ్డి, బంటు పెద్ద సాయన్న, చిట్టి నారాయణరెడ్డి, మాచపత్రి గంగారాం, బంటు సుభాష్ ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం


అంబటి నాగరాజు

నిజామాబాద్ రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా డిచ్‌పల్లిలోని తెలంగాణ యునివర్సిటీకి చెందిన అంబటి నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర శాఖకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

నిరాశ్రయులకు రగ్గుల పంపిణీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులోగల అర్బన్ ఉమెన్స్ షెల్టర్ పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో శనివారం రాత్రి నిరాశ్రయ మహిళలకు రగ్గులు, టిఫిన్‌బాక్సులను శ్రీలక్ష్మీ చేయూత సేవా సమితి సభ్యులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు వంగల రమణాచారి, సెక్రటరీ లక్ష్మన్, కోశాధికారి భూషన్‌చారి, కార్యవర్గ సభ్యులు శ్యామ్‌కుమార్, పూర్ణచందర్, కృష్ణ పాల్గొన్నారు.

దంతవైద్య శిబిరం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆనంద నిలయం(అనాథ పిల్లల ఆశ్రమం)లో ఆదివారం జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అలాగే వారికి దంతాల సంరక్షణ జాగ్రత్తలు సూచించారు. అంతర్జాతీయ మానవ హక్కుల రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు స్వప్న, జిల్లా అధ్యక్షులు రాచర్ల భాస్కర్ రాజు, ఉపాధ్యక్షులు బిల్లా సాయిబాబా, రాపల్లి గురు చరణ్, కన్వీనర్ నవీన్, సతీష్, వైద్యులు సమీర్ బనావత్, అనసూయ పాల్గొన్నారు.

ఘనంగా గోవిందమాంబ కల్యాణం



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆర్యనగర్‌లో ఆదివారం విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం (వేవా) ఆధ్వర్యంలో ఇంటింటా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేవా జిల్లా అధ్యక్షుడు రాఘవపురం గోపాలకృష్ణచార్య, జిల్లా సలహాదారుడు వడ్ల హన్మాండ్లుచారి-సరోజన, సభ్యులు శ్రీధర్, రాంచందర్, శ్రీనివాస్, కాళిదాసు, విజయ్ కుమార్, వెంకటేశం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ డీసీపీకి సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి)లో ఆదివారం వరంగల్ డీసీపీ దాసరి మురళీధర్‌ను పద్మశాలీ సంఘం తర్ప–1 ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు వేముల కిషన్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన దాసరి మురళీధర్ ఐపీఎస్ హోదాలో విధులు నిర్వర్తించడం గర్వకారణమన్నారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నతస్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి రచ్చ ఆనంద్, ఉపాధ్యక్షుడు గూడ నర్సింహులు, కోశాధికారి రచ్చ అంజనేయులు, సలహాదారులు రచ్చ శ్రీను, వేముల విశ్వనాథ్, జిందం దశరథం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.